# పుల్లకూర

"నాగరికతకూ, అందానికీ సంబంధం ఉన్నదం టారా? లేదంటారా?" అన్నాడు భావనారాయణ, సుతారంగా సిగరెట్ పొగను గాలిలోకి వదులుతూ.

వున్నవలుగురూ నాలుగుమాటలూ అన్నారు. ఏమాటా అనకుండా వున్నవాణ్ణి నేనే! ఏదో అనలేకా కాదు, తెలీకా కాదు. దానివల్ల ప్రయోజన మేమిటా అని! మేమన్నా అనకపోయినా భావనారాయణ చెప్పదలచిం దేమిటో ఎటుగూడీ చెబుతాడు, క్షణంసేపు వోర్చుకోనే దానికి ఎందుకా తొందరపాటనిపించింది నాకు. సగం అందుకే నేను నోరు మెదపలేదు. అయినా భావనారాయణ ఊరుకోలేదు.

"ఏరా అబ్బిగా! నీఉద్దేశమేమిటి?" అన్నాడు భావ నారాయణ, సిగరెట్టును దూరంగావిసిరి పొడిదగ్గు దగ్గుతో.

"ఎండాకాలం ఇవి చాలా అవసరం - చెప్పులు, గొడుగు అన్నట్టుంది నువ్వు చెప్పే సంగతి. అవసరమంటే రెండూ అవసరమే! కాకపోతే ఏదీకాదు" అన్నాను భావ నారాయణను తదేకంగా చూస్తో. "నీ ఉద్దేశమేమిటో చెప్పు మరి."

"వస్తున్నాను" అన్నాడు భావనారాయణ, జేబు గుడ్డతో ముఖం తుడుచుకొంటో-"ఒక్కో-నిర్ణయానికి రావ

డానికి, ఒక్కో సంఘటన కారణభూతమవుతుందనుకొంటాను. అంతక్రితం ఎప్పుడూ ఆలోచించనిదాన్ని గురించి, ఓ చిన్న మలుపుతో, అనుకోనితూగుతో, మనం చటుక్కున ఆలోచిస్తాం ఓ నిర్ణయానికి వచ్చేస్తాం. మరింక ఆనిర్ణయానికి జీవితాంతం తిరుగుండదు. అలాగని అందరూ అలా వుంటారనికాదు, అలా నిర్ణయాలు చేసేసుకొంటారనీ కాదు. నా మట్టుకు నేనూ ఓసారి, సరిగ్గా ఇలాంటి చిక్కులోనే పడ్డాను."

"ఎప్పుడు?" అన్నా, ముందుకథను నిజంగా రంగంలోకి దింపుతో.

"ఎప్పుడంటే-" అని ప్రారంభించాడు భావనారాయణ, క్షణకాలం కళ్ళుమూసుకొని ఆలోచించి, దగ్గి గొంతు సరిచేసుకొంటో.

"నే నప్పుడు గుంటూర్లో వుంటున్నాను అరండల్ పేటలో. ఓ గుహలో కాపురం, నియాండర్తల్ జాతి మనిషయినా అలాంటి గుహల్లో కాపురముంటాడని నే ననుకోను. ఏ సౌకర్యమూ లేదు. అయినా ముప్ఫయ్ రూపాయలూ, వడేసి పిండుకొని, పన్నెండు రూపాయలకు రసీదిచ్చేవాడు ఇంటాయన! పోనీ, ఇంకో కొంపలోకి మారదామా అని చాలాసార్లు అనుకొన్నాను. అయితే అలా మారడానికి నేను ప్రయత్నించిన పాపానపోలేదు. కొన్ని లాభాలకోసం, మరికొన్ని నష్టాలకు, విసుక్కుంటూ భరించేగుణం మానవుడిలో అనాదినుంచీ ఉన్నదను

కొంటాను. ఎక్కువడబ్బు పెట్టలేకపోవడమన్న ప్రశ్నే లేదు. ఎంతపెట్టినా మంచిఇల్లు దొరుకుతుందనే గ్యారంటీ లేదు. అథవా దొరికినా, ఆ పొగాకుకంపెనీకి దగ్గర్లో అసలే దొరకదు. పోనీ దూరంగా వెళ్ళామయ్యా అనుకో, రానూ, పోనూ రిక్షా చార్జీలు కలుపుకొంటే తడిసి మోపెడవుతుంది! అదీగాక, ఈ నరకవాసానికి అధమం రెండేళ్ళయినా అలవాటుపడ్డాను. మళ్ళా కొత్తచోటికి పోవడం, పరిసరాలతో రాజీ, అదో పెద్ద జింజుఖానా మళ్ళా! అందుకనే సరిపెట్టుకొంటున్నాను... ...

"నిజానికివన్నీ సజావైన కారణాలేగదూ! ఏ ఒక్కరూ, అనుమానించడానికి గానీ, కాదనడానికిగానీ ఇందులో అవకాశం లేదనుకొంటాను. ఇవన్నీ సరైన కారణాలే అయినప్పటికీ వీటన్నింటినీ మించిన బలవత్తరమైన మరో కారణం ఉంది—కరెక్ట్! భూషిగాడన్నట్టు ఆడదే!

"అంతకుముందు అనేకమంది ఆడవాళ్ళను దగ్గరగానూ, దూరంగానూ చూశాను. అందులోనూ పొగాకు కంపెనీల్లో ఆడవాళ్ళకు కొదవేమిటి? ఎక్కువమంది ఆడజనాన్ని పోషిస్తున్నవాటిల్లో హాస్పిటల్స్ తరవాత పొగాకుదే అగ్రస్థానం! ఎందుచేతనంటే-సరే అసలువిషయాని కొస్తున్నాను. తిరపతమ్మను చూడకముందు, నాకా ప్రశ్న కలగనేలేదు" అన్నాడు భావనారాయణ నవ్వుతూ. వాడి కళ్ళు తళతళమన్నాయి. నొసలు అదోలా, పైకీ కిందికీ ఆడించాడు భావనారాయణ.

"ఏ ప్రశ్న?" అన్నా రెవరో.

"అదేరా, 'నాగరికతకూ, అందానికీ సంబంధం ఉన్నదా? లేదా?' అన్న ప్రశ్న. తిరపతమ్మను చూశాకనే ఆ ప్రశ్న కలిగింది. ఆ వెంటనే సమాధానమూ దొరికింది!" అన్నాడు భావనారాయణ.

"ఏమిటది?" అన్నాను ఉండబట్టలేక.

భావనారాయణ తాపీగా సిగరెట్టు వెలిగించి, సిగరెట్ పొగతోనే, అగ్గిపుల్లను ఆర్పేసి, మందుబుగ్గను బూటుకేసి రాచి, రాల్పేసి, పుల్లను రాగిడిమట్టిలో గుచ్చేశాడు.

"సంబంధం ఉండదురా! అందందోవ అందానిదే, అలంకారాలదోవ అలంకారాలదే! నా కింకోటికూడా అనిపిస్తోంది: ఏమిటంటే, సహజ సౌందర్యం లోపించినప్పుడే, కృత్రిమాలంకారాల అవసరం కలుగుతుందా అని! జన్మతః సౌందర్యం పుణికి పుచ్చుకొన్నవారికి, అలంకారాల అవసరం ఉండనే ఉండదు. ఆ లోపాలను కప్పిపుచ్చుకొందుకు మానవజాతి చేసే మహాప్రయత్నమంతా, ఈ అలంకారాలలో స్ఫుటంగా కనిపిస్తూంటుంది. చెప్పవచ్చిం దేమిటంటే-తిరపతమ్మ నిరాభరణసుందరి" అన్నాడు భావనారాయణ గట్టిగా గాలివొదిలి.

"ఈ లోకం-" అంటూ ప్రారంభించాడు వాడు ఉ|ద్రేకంగా. "అందంపట్ల ఇంతగా గుడ్డితనం ఎందుకు తెచ్చుకొందో నాకు తెలీదు. తిరపతమ్మ ఎంత అందంగా వుంటుందంటే-చెప్పలేనంత! అనకూడదుగానీ, నాకే

అలాంటి భార్యంటూ ఉంటే, ఈ పొగాకు కంపెనీ, దిక్కు-మాలిన నూటపన్నెండురూపాయల ఉద్యోగమూ, అంకెల కూడికా మాని, అస్తమానం ఆవిడకళ్ళల్లోకి చూస్తూ, అలానే ప్రాణాలు వొదిలేద్దును. కానీ-ఏంలాభం! దాని మొగుడికా యోగ్యతలేదు."

కొండవెనక ఎర్రరంగులు చిమ్ముతో సూర్యుడు దాటిపోతున్నాడు. నెత్తిమీద కొంగలు బారులు బారులుగా పోతున్నాయి. కట్టమీద గడ్డిమోపెత్తుకొని ఎవరో పోతున్నారు. తూములోంచి నీళ్ళు రొదపెడుతూ పారుతున్నాయి. చేపపిల్లలు, తూముకుపెట్టిన కంపకు కొట్టుకొని గిజగిజలాడిపోతున్నాయి.

"తిరపతమ్మది గోరంట్ల" అన్నాడు భావనారాయణ చేతికయిన రేగడిపొలుసులను దులుపుకొంటో-"ఏదోపొలం వున్నదనుకొంటాను. మొగుడు కిల్లీకొట్టుమీద పదిగంటల దాకా ఉంటాట్ట! గుంటూరులో ఆవేళదాకా పెరుగు పోసిన తిరపతమ్మ అప్పుడువెళ్ళి మొగుణ్ణి రిలీవ్ చేస్తుందట. వాడు గొడ్లుతోలుకొని పొలంపోతాట్ట. పెరుగెత్తుకొచ్చేముందే, వంటచేసి వస్తుందిట! కొట్టుమీద అట్టే రాబడి ఉండదుట! ఏదో వేణ్ణీలకు చన్నీళ్ళు తోడుగా ఉంటాయని, తనే సతపోరి మొగుడిచేత కొట్టు పెట్టించిందట!"

భావనారాయణ ఇంకో సిగరెట్టు అంటించాడు.

"ఒక్కోసారి ఆడజనం, ముఖ్యంగా భార్యామణులు, వాళ్ళగోతిని వాళ్ళే తవ్వుకొంటూ ఉంటారనుకొంటాను.

గోతిలో పడ్డదే కాకుండా, తప్పంతా మగవాడి నెత్తిన రుద్దడం వాళ్ళకో సరదాగావుంటుందేమో! నిజం చెప్పాలంటే తిరపతమ్మదగ్గర పెరుగుఖాతా ప్రారంభించిం దల్లా, మా ఆవిడే. నేనేగనుక ఆమాటఏమాత్రం ముందుగా అన్నా: నాభార్యాలలామ, నా ప్రాణాలు జుర్రెయ్యడమే కాకుండా, తిరపతమ్మప్రాణాలను నంజుకుండేది! నల్లగా ఉండే తిరపతమ్మ, నాకు నచ్చుతుందనిగానీ, ఆవిడకోసంఅంగలారు స్తాననిగానీ, ఈభార్యప్రాణి ఏమాత్రం పసిగట్టినా తిరపతమ్మ దర్శనభాగ్యం నాకు దొరికేదే కాదు.... అవున్నా భూషిగా! తిరపతమ్మ నల్లగా, పొడుగ్గా ఉండేది. ఎప్పుడూ ఆకుపచ్చ చీరలేకట్టేది! ఆ చీరెలకు మిరపపండు రంగు అంచులంటే తిరపతమ్మకు ఎంతో ఇష్టమట! మెళ్ళో నాను, చేతులకు మూడేసి గోట్లు, కడియాలు, అందెలు, వేళ్ళకు పిల్లేళ్ళు, పలచని పొట్ట, రవిక చాలని వక్షసౌందర్యం, గుండ్రని మెడ, చెవలవెనక చెమటకు తడిసి ఉంగరాలుతిరిగిన తడి జుట్టు, ముద్దబంతి పూలచెండు — కళ్లు తిరిగిపోయేవనుకో!

"తిరపతమ్మమీాది వాంఛకన్నా, దాని మొగుడి మీాదకోపం నాకు అధికంగా ఉండేదనుకొంటాను. రాను రాను నే చూడని ఆ వ్యక్తిమీాద, నాకు విపరీతమైన కోపం, అది తీర్చుకోలేక సతమతమయ్యే అసహ్యం-అసూయ-ద్వేషం... ఒక్కటా! ఎన్నిపనులున్నా, తిరపత మ్మొచ్చేవేళకు కొంపకు హాజరయ్యేవాణ్ణి! ఏదో వొంకతో ఆవిణ్ణి మాట్లాడించేవాణ్ణి! నవ్వడమంటే ఏమిటో తిరపతమ్మ దగ్గరే చూడాలి. అంతకన్నా స్వచ్ఛమైననవ్వు నే నింత

వరకూ చూడలా! తిరపతమ్మను చూసినపుడల్లా ఆవిడ భర్త జ్ఞాపకమొచ్చి, ఉక్కిరిబిక్కిరయ్యేవాణ్ణి. ఇంత అందమైన తిరపతమ్మా చీకట్లో, పూరిపాకలో, బుడ్డిదీపంమాటు వెలుతుర్లో, నులకమంచంలో భర్తతో కలిసి ఉండటం కళ్ళముందు మెదిలి, చలించిపోయేవాణ్ణి. నెత్తిమీద బెట్టుకొని ఆరాధించవలసిన వ్యక్తి, అలా అతితక్కువ స్థాయిలో ఉపయోగింపబడటంకన్నా అన్యాయం నాకు తట్టలేదు.

"ఏదో ఓ సాహసం చెయ్యకపోతే లాభంలేదని నిర్ణయించుకొన్నాను. కానీ, కొంపలో ఏం చెయ్యడానికీ లేదు. చెప్పొగదూ, ఈ భార్యలకన్నా గుదిబండలు చాలా నయమని! వీళ్ళు సుఖపడనూ పడరు, భర్తలు సుఖిస్తుంటే చూసి సంతోషించనూ లేరు. అందుకనే ఒకరోజున, సెలవుపెట్టి గోరంట్ల వెళ్ళాను. ఆమె భర్త అప్పటికే పొలం వెళ్ళాడు. కొట్టుమీద తిరపతమ్మొకతే ఉంది. నన్ను చూడంగానే ముందు ఆశ్చర్యపోయింది. ఆతరువాత నవ్వింది. ఓ సోడా కొట్టి, కాస్త తీపికలిపి యిచ్చింది. వద్దంటున్నా వినకుండా కిళ్ళీ కట్టిచ్చింది! సంభాషణ ఎలా ప్రారంభమయిందో చెప్పలేను. కానీ చుట్టుతిరిగి అసలువిషయంలోకి వచ్చింది. ముందు-సగటువారీ భారతనారిలాగా, తిరపతమ్మ కాదూ కూడదన్నది. కూటికి పేదనై నంతమాత్రాన గుణానికి పేదనుకానన్న సుభాషితంగూడా వాడింది.! తననుగురించి అలాంటి పిచ్చిభ్రమలు పెట్టుకోవద్దన్నది, "ఇట్లాంటి ఉద్దేశం మీకుంటే ఇక మీ గడపగూడా తొక్క"నన్నది. ఎన్నం ఉన్నేంగానీ కొసకు ఒప్పుకోడమే నాక్కావాలి. ఆ కాస్త

మాటా అనిపించుకోనిగానీ, నేను గుంటూరు రాలేదు.

"తీరా వచ్చాక, అనుకొన్నవన్నీ ఏర్పాటుచెయ్య డానికి నాకు చాలా అవాంతరాలు కనిపించాయి. సరిగ్గా రేపు సాయంత్రం, ఎనిమిదీ-తొమ్మిది గంటలమధ్య, తిరప తమ్మ మా యింటి కొస్తుంది. అరగంట తరవాత వెళ్ళి పోతుంది. మళ్ళా జన్మలో ఆవిడపేరెత్తడంగానీ, ఆవిణ్ణి చూడటంగానీ, నేను చెయ్యరాదు. ఆ సంఘటన జరగనల్లే ఉభయులమూ ప్రవర్తించాలి. అందుకు నేను చెల్లించవల సిన రుసుమేమీ లేదు. కానీ, ఉత్తినే పంపడానికి నాకూ ప్రాణం వొప్పదు మరి! అంచాత ఓ యాభై ఇద్దామను కొన్నాను. డబ్బుఇబ్బందిగూడా లేదు .... మిగతావన్నీ సరే! సరిగ్గా ఆ సమయానికే, ఇంట్లో మా ఆవిడ లేకుం డటం ఎలా?

"ఈ సమస్యను పరిష్కరించినవాళ్ళు 'ఎదురింటి అమ్మాయి' చిత్ర నిర్మాతలు, నా పూర్వజన్మ సుకృత విశేషంవల్ల నయితేనేం, నేను నోచుకొన్న నోమువల్లనయి తేనేం ఆ మహత్తర చిత్రరాజం, అంతకు రెండువారాల క్రిందనే రిలీజయి, తిరిగి వెనక్కు వెళ్ళబోయేదశలో నిర్మాతలూ, హాలువాళ్ళూ కలిసి ఆ చిత్రరాజంలో నటిం చిన గుంపును తోలుకొచ్చి, స్టేజీమీద ఆరోజునే నిల వెయ్యబోతున్నారట! ఆ సువర్ణావకాశాన్ని ఏవిధంగానూ జారిపోనివ్వగూడదన్న దృఢాభిప్రాయం, నా భార్యకు కలగడం, నా అదృష్టంకాక మరేమిటి! ఆవిడ నన్నుకూడా

తనతో బాటు రమ్మని బలవంతంచేసింది! రానన్నందుకు ఎంత యాష్టపడాలో అంతా పడింది. జన్మ తరింపుచేసుకోవాలన్న యావ నాకు లేదన్నాను. 'అయితే నాకున్న' దంటూ ఆవిడ వెళ్ళింది...

"అనవసరంగా కథను పెంచి మిమ్మల్ని విసిగించడం నాకిష్టంలేదు. ఆ రాత్రి ఎనిమిదీ-తొమ్మిది గంటలమధ్య కాలంలో నే ననుభవించిన అనుభవం,నభూతో నభవిష్యతి. ఆ అరగంటా నాకిచ్చి, మిగతాకాలమంతా పరమేశ్వరుడు పుచ్చుకొన్నా నా కభ్యంతరం లేదు. అది సుఖమో, ఆనందమో, కలో, కాక మరేమిటో నాకు తెలీదు. మహాత్ములు యోగసాధనలో, తురీయావస్థలో పొందే పరబ్రహ్మపదమేదో, ఆ రాత్రి ఆ మసకచీకటిలో, గదిలో, ఆమె గాఢాలింగనంలో, పెదిమలుకలిపే నేర్పులో, తూగులో, మూర్ఛనతో, పొంది-చీల్చి, త్రాగి, తృప్తితో- అలానే కాలంకదలకుండా ఆగిపోగూడదా అనిపించింది క్షణంసేపు.

"నిశ్శబ్దంగా చీకటి మమ్మ ముంచివేసినప్పుడు బలవంతాన నేనే ఆమెకు యాభైరూపాయలూ ఇచ్చాను. ఆ నిమిషాన నేనెంత సిగ్గుపడ్డానో, ఇప్పు డెలా చెప్పడం? నేనుపొందిన ఆ అమేయానందాన్ని కించపరుస్తున్నానేమో నని, లోలోపల ఎంత మథనపడిందీ వివరించడం, ఇప్పుడు సాధ్యంకాదు. చివరిసారిగా కౌగలించుకొని, పెదిమకలిపి, మెడమీద ముద్దుపెట్టుకొని, వెచ్చగా తిరపతమ్మను సాగనంపాను...."

భావనారాయణ తడుముకొంటూ సిగరెట్ పెట్టె అందుకొని, అగ్గిపుల్ల గీశాడు. ఆ వెలుగులో అతనికళ్లు మిలమిలలాడుతున్నాయి. చుట్టూ చీకటినీడలు అల్లుకొన్నాయి. ఊళ్ళోని దీపాలు, చెరువునీళ్ళల్లో దీర్ఘంగా ప్రతిఫలిస్తున్నాయి. గుళ్ళో గంటమోగుతోంది. ఆఖరు బస్సు పెద్దగా మూలిగి, దుమ్ము రేపుకొంటూ మూల తిరిగింది.

"వారంరోజుల తరవాత-" అన్నాడు భావనారాయణ, చిటికెన వేలితో సిగరెట్ నుసిని రాల్చుతూ, "ఎందుకో మా ఆవిడ పెట్టె తీశాను. అయిదు పదిరూపాయిల నోట్లూ మొగలిపొట్లంవెనక ఉన్నాయి. నాకున్న జ్ఞాపకం ప్రకారం, ఆ నోట్లు, ఆ రాత్రి నేను తిరపతమ్మకుఇచ్చాను. అవేనోట్లు, ఈవిడపెట్టెలో కెలా వచ్చాయనిగానీ, ఎందుకొచ్చాయనిగానీ ఆలోచించి - సమాధానం చెప్పుకొని, ఆనాడు నేను పొందిన మధురానుభూతిని మలినీభూతం చేసుకోవడం, అప్పటికీ ఇప్పటికిగూడా నా కిష్టంలేదు."